సాక్షి నారాయణపేట

ఆదివారం ׀ 24 ׀ డిసెంబర్ ׀ 2023



..విగ్రహాల తరలింపు

బీచుపల్లి కృష్ణానదిలో ఉన్న పురాతన విగ్రహాలను మహబూబ్‌నగర్‌కు తరలించారు.

వివరాలు 10లో ▸



అయ్యో.. దేవుడా!

అలంపూర్ యోగనారసింహుడు వైకుంఠ ఏకాదశి రోజు పూజలకు నోచుకోలేదు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.9/12.8

చలి తీవ్రత అధికంగా ఉండడంతోపాటు ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



ధన్వాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. శనివారం ధన్వాడ మండలంలోని చర్లపల్లిలో పల్లె దవాఖానా, మడిగెలములతండాలో గ్రామ పంచాయతీ కార్యాలయం, ధన్వాడ సింగిల్‌విండోలో కామన్ సర్వీస్ సెంటర్లను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలో ఆరు గ్యారంటీలను అమల్లోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు వెంకట్రాంరెడ్డి, సర్పంచులు రాములు, హన్యనాయక్, దమోదర్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనంతమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నారాహరి, శివకుమార్, ఆనంద్‌గౌడ్, లక్ష్మయ్యగౌడ్, రఘువేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభచాటాలి



ధన్వాడ: విద్యార్థులు తాము ఎంచుకున్న క్రీడలో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గిరిజన గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ నాగార్జునరావు సూచించారు. శనివారం ధన్వాడ మండలంలోని కొండాపూర్ గురుకుల గిరిజన గురుకులాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 22వరకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం గురుకుల విద్యాలయంలో 67వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటిలలో అండర్ 17 విభాగంలో ఏడుగురు రజత పతకం సాధించారు. విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌రావు, నెట్‌బాల్ కోచ్ రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియంలో రోబోటిక్స్ ప్రదర్శన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని పిల్లలమర్రి వద్ద ఉన్న సైన్స్ మ్యూజియంలో శనివారం సోహస్ ఫౌండేషన్, పిల్లలమర్రి సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో రోబోటిక్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా 21 పాఠశాలల నుంచి రోబోటిక్స్‌పై 21 ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌ను డీఈఓ రవీందర్ మర్యాదపూర్వకంగా సన్మానించారు. కార్యక్రమంలో సోహస్ ఫౌండేషన్ అధ్యక్షుడు సహదేవ్, ఎన్‌టీటీ డాటా అధ్యక్షుడు తిప్పరాజు, సైన్స్‌ఫోరం అధ్యక్షుడు పద్మావతి, కార్యదర్శి సంషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు తరలిన జట్టు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పాలమూరు యూనివర్సిటీ హాకీ పురుషుల జట్టు శుక్రవారం బయలుదేరింది. ఈ మేరకు జట్టు సభ్యులకు పీయూ అధికారులు ట్రాక్‌సూట్లను అందజేశారు. ఈ సందర్భంగా వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లో పూర్తిస్థాయిలో ప్రతిభను కనబర్చి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేటలోని బాలాజీ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు..



జడ్చర్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి బారులుతీరిన భక్తులు..

స్వామివారికి నమస్కరిస్తున్న యువతులు

వైకుంఠవాసుడికి.. ముక్కోటి దండాలు

నారాయణపేట రూరల్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లావ్యాప్తంగా వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ఉత్తర ద్వారాల నుంచి ప్రవేశం కల్పించడంతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పలు ఆలయాల్లో పారాయణాలు, ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. నారాయణపేటలోని శ్రీబాలాజీ, అనంతపద్మనాభస్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శనానికై బారులుతీరారు. ఆలయంలో స్వామి వారికి రోజంతా సహస్రనామార్చన, పుష్పార్చన, ఇతర ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో వేద పండితులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం గావించారు. అదేవిధంగా పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శిల్ప కళావైభవం

కనువిందు చేస్తున్న అలంపూర్ పురావస్తు మ్యూజియం

- 26 శాసనాలు, 188 శిలా విగ్రహాలతో 71 ఏళ్ల క్రితం ఏర్పాటు
- 6 నుంచి 16వ శతాబ్దాం నాటి విగ్రహాల ప్రదర్శన
- రోజురోజుకు పెరుగుతున్న పర్యాటకులు



పురావస్తు మ్యూజియం అంతర్ భాగం

పురాతన ఇతిహాసాలు, ప్రకృతి వింతలు, అలనాటి సంప్రదాయాలు.. వేషధారణను శిల్పాల ద్వారా భావితరాలకు తెలియజేసే ప్రయత్నం చేశారు నాటి శిల్పులు. ఎంతో చరిత్ర కలిగిన ప్రాంతాల్లో ఇలాంటి శిల్ప సంపదలు దర్శనమిస్తూనే ఉంటాయి. ఐదో శక్తిపీఠంగా ప్రసిద్ధి చెందిన అలంపూర్ క్షేత్ర పరిసర ప్రాంతంలో లభించిన పురాతన, అరుదైన శిల్పాలతో పురావస్తు శాఖ ఏర్పాటు చేసిన మ్యూజియం పర్యాటకులను కనువిందు చేస్తోంది.

– మహబూబ్‌నగర్ డెస్క్

సండే స్పెషల్

శిల్పాలకు అంతర్జాతీయ ఖ్యాతి..

అలంపూర్‌లో పురావస్తు మ్యూజియంలోని శిల్పాలు దేశ విదేశాల్లో ఖ్యాతిని తెచ్చిపెడుతున్నాయి. ఇక్కడి శిల్పాలు ప్రపంచ పురావస్తు శిల్పాల ప్రదర్శనలకు వెళ్లి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నాయి. 1977లో ఇక్కడి నటరాజమూర్తి విగ్రహాన్ని లండన్‌లో ప్రదర్శించారు. అలాగే 1984లో సూర్యవిగ్రహాన్ని జర్మనీలో, 2008లో సూర్య, నాగ, మహిశాసురమర్దిని బెల్జియంలో ప్రదర్శించారు. శిల్పాచార్యులు స్థానికంగా లభించే నల్లరాతి శిలతో అందంగా నటరాజ విగ్రహాన్ని చెక్కారు. క్రీ.శ.7– 8 శతాబ్దాలకు చెందిన సూర్యవిగ్రహం కూడా మెత్తటి ఎర్ర ఇసుక రాతిని ఉపయోగించి తయారు చేశారు. 'సప్తాస్వ రథసమారూఢం' అన్నట్టుగా ఏడు గుర్రాలతో ఒకే చక్రం కలిగిన రథం, ఉషా, ఛాయా సమేతంగా మలచిన సూర్య విగ్రహం చూపరులను ఆకట్టుకుంటుంది. ఇక 6–7 శతాబ్దాలకు చెందిన నాగబంధ విగ్రహాన్ని పరిశీలిస్తే పద్మబంధం ఏడు తలలు కలిగి మానవ ఆకృతిని పోలి ఉంటుంది. 7–8 శతాబ్దాలకు చెందిన మహిషాసురమర్దిని విగ్రహం కూడా అలనాటి దేవి భాగవతాన్ని కళ్లకు కట్టినట్టుగా చూయిస్తుంది. పరమశివుడి రూపం అలంపూర్ మ్యూజియంలో దేవతాస్వరూపంలో.. అది కూడా సతీసమేతుడై ఉన్న పార్వతీపరమేశ్వరుడిగా నంది వాహనంపై ఆసీనులై దర్శనమిస్తారు. ఆలయాల మనుగడ కోసం అలనాటి రాజులు ఎన్నో భూములను మాన్యాలు సమర్పించారు. సూర్యచంద్రులు ఉన్నంత వరకు ఈ మాన్యాలు ఆలయాలకు చెందాల్సిందేనని, అలాంటి మాన్యాలను ఎవరైన హస్తగతం చేసుకుంటే గోవధ చేసినంత పాపం వస్తుందని తెలియజేస్తూ ఆ శాసనంపై సూర్య, చంద్రులు, లింగం, ఆవు, ఖడ్గం వంటి బొమ్మల శిలా శాసనాలుల్లో అది హలగన్నడ లిపిలో కనిపిస్తాయి. మ్యూజియంలో అలనాటి వైభవాన్ని చాటి చెప్పే స్తంభంపై మలచబడ్డ శిల్పాకృతులను పరిశీలిస్తే పట్టు చీరలపై ఉన్న బార్డర్ల డిజైన్‌లు తలపిస్తున్నాయి.



నంది, ఏనుగు విగ్రహాలు

అద్భుత మ్యూజియం



అష్టాదశ శక్తిపీఠంగా విరాజిల్లుతున్న జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ సముదాయంలో పురాతన శిల్పాలతో అద్భుత మ్యూజియం ఉంది. ఇక్కడ వెయ్యి సంవత్సరాలకు క్రితం పైగా నాటి విగ్రహాలున్నాయి. అబ్బురపరిచే శిల్పాలు ఇక్కడ ఉన్నాయి.

– జయరాముడు, మాజీ సర్పంచ్, అలంపూర్

అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శన



జోగుళాంబ క్షేత్రంలో ప్రతి ఒక్కరూ చూడాల్సిన పురాతన ఆలయ శిల్పాల సమూహం ఉన్న మ్యూజియం ఉంది. ఇక్కడ ఏర్పాటు చేసిన పురాతన విగ్రహాలు అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించి బహుమతులు కూడా సాధించారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న విగ్రహాలను భక్తులు వీక్షించే వెసులుబాటు ఉంది.

– వెంకటేష్, ఆలయ ధర్మకర్త, అలంపూర్

చరిత్ర, ఇతిహాసాలపై అవగాహన



ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు అందుబాటులో పురావస్తు మ్యూజియం ఏర్పాటు చేశారు. పురాతన విగ్రహాల సముదాయం భక్తుల మనస్సులను ఆహ్లాదపరుస్తోంది. ఇలాంటి మ్యూజియాల వల్ల చరిత్ర, ఇతిహాసాలపై అవగాహన కలుగుతోంది. రోజురోజుకూ మ్యూజియాన్ని సందర్శించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

– రవి, అలంపూర్ మ్యూజియం ఇన్‌చార్జ్

26 శాసనాలు.. 188 విగ్రహాలు





అలంపూర్‌లోని పురావస్తు ప్రదర్శనశాలను 1952లో ప్రారంభించారు. ఆలయాల పరిసర ప్రాంతాలలో పాటుగా సమీప గ్రామాలలో లభించిన శిలా శాసనాలు, విగ్రహాలను అన్నింటినీ సేకరించి సిద్ధుల మఠంగా పిలవబడే మండపంలో మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఈ మ్యూజియాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ మ్యూజియంలో 26 శిలాశాసనాలు, 188 విగ్రహాలు ఉన్నాయి. ప్రతి రోజూ క్షేత్రానికి వచ్చే పర్యాటకులు సందర్శించుకునే అవకాశం కల్పించారు. క్రీ.శ. 6వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దం వరకు రాజుల ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు వారిచే ఆరాధించబడిన దేవతా మూర్తుల విగ్రహాలు ఇక్కడ కొలువుదీరాయి. ఆరవ శతాబ్దంలోని బాదామి చాళుక్యుల కళా సంస్కృతి ఇక్కడ వెలసిన శిల్పాలు నిదర్శనంగా ఉన్నాయి. 1500 ఏళ్ల క్రితం అలంకారం, ఉపయోగించిన ఆభరణాలు, అప్పటి మహిళల వేషధారణ ఇక్కడి విగ్రహాలలో చూడవచ్చు. ఈ ప్రదర్శనశాలలో వీరాంగవీరులు (భర్త, భార్య ఇద్దరూ శత్రువులతో పోరాడి వీరమరణం పొందిన వారు), వీరుగల్లు, వీరశిలా విగ్రహాలు, వారి బల ప్రదర్శనలు నేటికీ స్పష్టంగా కనిపిస్తాయి. సతీ సహగమనానికి సంబంధించిన విగ్రహాలు ఇక్కడ కనిపిస్తోయి.



శిలాశాసనం



పురాతన శిల్పాల సముహం

కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలి



జిల్లా కోర్టులో రికార్డుల గదిని పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి సీవి భాస్కర్‌రెడ్డి

నారాయణపేట: కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని హైకోర్టు న్యాయమూర్తి సీవి భాస్కర్‌రెడ్డి సూచించారు. జిల్లా కోర్టు సముదాయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ముందుగా ఆయనకు కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్ గౌతమ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ, సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జిలు ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి భాస్కర్‌రెడ్డి కోర్టు సముదాయంలోని జిల్లా జడ్జి, సినియర్, జూనియర్ సివిల్ జడ్జిల కోర్టు హాళ్లను, స్టాఫ్ రూమ్, సెక్షన్ రూమ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, ఆఫీసర్స్ ఛాంబర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గదిని పరిశీలించారు. బార్ అసోసియేషన్ ఛాంబర్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, సినియర్ న్యాయవాది నాగునారావు నామాజీ హైకోర్టు న్యాయమూర్తిని శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి కోర్టుహాల్‌లో ఏర్పాటు చేసిన జ్యూడిషయల్ ఆఫిసర్స్ కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్‌రఫీ నివేదికను చదివి వినిపించగా.. హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడారు.

కేసులు పెండింగ్ ఉంచొద్దు..

జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కేసులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. తక్కువ సమయంతో కూడిన డేట్‌లు ఇచ్చి కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. హైకోర్టులో బెంచీ మీద రోజు 30 కేసులను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. తన దగ్గరకు వచ్చిన కేసులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని చెప్పారు. జిల్లా కోర్టులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని జడ్జిలను అడిగి తెలుసుకున్నారు. కోర్టులో స్టాఫ్ తక్కువగా ఉందని 105 మంది స్టాఫ్‌కు కేవలం 48 మంది మాత్రమే ఉన్నారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. కోస్గి కోర్టు పరిధిలో స్టేనో లేరని, కోర్టు భవనం శిథిలావస్థకు చేరిందని కోస్గి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఫరిన్ బేగం తెలిపారు. స్పందించిన హైకోర్టు న్యాయమూర్తి కొత్త నియామకాలకు నోటిఫికేషన్ ప్రకటించే అవకాశం ఉందని, ఒక్క జిల్లా కోర్టులోనే కాదు హైకోర్టులో కొరత ఉందన్నారు. మొదటి సారి నారాయణపేటకు వచ్చానని, కోర్టుల పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో సినియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జిలు ఉమర్, జాకియా సుల్తానా , న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట రూరల్: జిల్లాలో బడిఈడు బాల బాలికలను బడి మాన్పించి పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, వచ్చే ఏడాది జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ – 10 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కొత్తగా కమిటీని ఏర్పాటు చేయగా.. చైల్డ్ వెల్ఫేర్, లేబర్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్, సఖి, బాలరక్షాభవన్ తదితర విభాగాల సభ్యులను శనివారం కలుసుకుని నిర్వహణపై చర్చించారు. ఎవరైన బాలకార్మికులను గుర్తిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098, డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐ రవిబాబు, లేబర్ అధికారి రాజ్‌కుమార్, ఆర్డీఓ కార్యాలయ ఏఓ తిరుపతయ్య, సీడబ్లుసీ రాధమ్మ, వివిద శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు దుప్పట్ల పంపిణీ..

పట్టణంలోని పేద ముస్లింలకు మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ అనే సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా దుప్పట్ల పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ.. సేవా దృక్పథంతో ప్రతి ఒక్కరు ముందుకు నడవాలని సూచించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవిబాబు, సంస్థ ప్రతినిధులు అజీమ్ హుస్సేన్, మహ్మద్ ఫజల్, సయ్యద్ అక్బల్, అమిరోద్దిన్, సలీం పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను కాపాడాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శైలజ

నారాయణపేట: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ శైలజ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను కాపాడాలన్నారు. ఇదే ఉద్దేశంతో వినియోగదారుల హక్కుల చట్టం 1986లో అమలులోకి వచ్చిందన్నారు. ఈ హక్కును కొన్ని మార్పులు, చేర్పులతో 2019లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంగా రూపొందించారన్నారు. వినియోగదారులు రాయితీలు, ఉచిత ప్రకటనలు లాంటివి ఆన్‌లైన్‌లో చూసి మోసపోవద్దన్నారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనల్ని నమ్మొద్దని ఉచిత డబ్ల్యూఫై ద్వారా హ్యాకర్లు సులువగా దోచేస్తారని, సులువైన పాస్‌వర్డ్‌లను నమోదు చేసుకోవద్దని సూచించారు. ఓటీపీలను ఇతరులతో పంచుకోవద్దని, వినియోగదారుడు ఏదైనా వస్తువును కొనుగోలు చేసినప్పుడు వస్తువు తయారీ చిరునామా, తేది, గడువు తేది, కస్టమర్ కేర్ నంబర్లను సరిచూసుకోవాలన్నారు. డిజిటల్ పేమెంట్, క్యూ ఆర్ కోడ్ సిస్టం, మొబైల్ యాప్‌ల ద్వారా చెల్లింపులు జరిపే ముందు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు విత్తనాలు, మందులు కొనేటప్పుడు బోగస్ కంపెనీల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వస్తువు కొంటే రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వినియోగదారులు మోసానికి గురైతే జిల్లా కన్‌జ్యూమర్ ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు జాన్‌సుధాకర్, చౌక ధర డీలర్లు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం

మక్తల్: అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే సాధ్యమైందని జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మక్తల్‌లో క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు ప్రభుత్వం నుంచి ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాం అన్ని పండుగలు, అన్నిమతాలకు ప్రాధాన్యత ఇస్తుందని, సుఖ సంతోషాలతో పండుగలు జరుపుకొనేందుకు దుస్తులు అందజేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి వల్లే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంల్లో తహసీల్దార్ సువర్ణరాజు, జాన్సన్ తదితరుల పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే..

కలెక్టర్ శ్రీకోయ హర్ష, ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను శనివారం జిల్లా కేంద్రంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కలిసి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన వాకిటి శ్రీహరి మొదటి సారిగా వారిని మర్యాదపూర్వకంగా కలిశారు.



మక్తల్‌లో క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ వనజ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- కుమార్తెను అత్తారింట్లో వదిలి వెళ్తుండగా ఘటన

ధరూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రానికి సమీపంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గట్టు మండలం ఆలూరుకి చెందిన అయ్యన్న(50) శనివారం తన ద్విచక్రవాహనంపై కుమార్తెను తీసుకుని అల్లుడి గ్రామమైన చింతరేవులలో కుమార్తెను వదిలి తిరుగు ప్రయాణమయ్యాడు. ధరూరు గ్రామ శివారులోని గొనిబావి వాగు సమీపంలో విద్యుత్ స్తంభాలతో గట్టు మండలం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్‌తో పాటు అయ్యన్నను ఆ లారీ కొంత దూరం వరకు లాక్కెల్లింది. ఈ సంఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందినట్లు అటుగా వెళ్తున్న వాహనదారులు తెలియజేశారు. మృతుడికి భార్య జయమ్మతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచినట్లు ఆలూరు సర్పంచు తిమ్మప్ప తెలియజేశారు.

బావిలో పడి మహిళ మృతి

పెబ్బేరు రూరల్: తాగునీటి కోసం వెళ్లి బావిలో పడి మహిళ మృతిచెందిన సంఘటన శ్రీరంగాపురం మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన బత్తుల శ్రీనివాసులు భార్య శ్వేత అలియాస్ సుజాత(23) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవారు. శనివారం మధ్యాహ్నం ఆమె పొలం వద్దకు వెళ్లి ఇంటికి రాకపోయేసరికి, ఆమె తల్లిదండ్రులు వెతుకుంటూ వెళ్లారు. పొలం పక్కన ఉన్న బావిలో తాగునీటిని తీసుకురావడానికి వెళ్లి బావిలో పడిపోయి ఉంటుందని కుటుంబ సభ్యులు గుర్తించారు. గ్రామస్తుల సాయంతో బావిలో వెతికి ఆమెను బయటకి తీశారు. అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలియజేశారు.

ప్రమాదవశాత్తు మరో మహిళ..

ఉప్పునుంతల: ఇంటి గేట్ తీస్తున్న క్రమంలో ఓ మహిళ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన ఘటన ఉప్పునుంతల మండలం పెనిమిళ్లలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పెనిమిళ్లకు చెందిన పద్మమ్మ (58) ఇంటి గేట్‌ను తీసే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. గ్యాస్ కనెక్షన్ ఈ–కేవైసీ చేయిస్తానని చెప్పి బయల్దేరిన ఆమె.. అకస్మాత్తుగా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు.



మన్యంకొండలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

గోవిందా.. గోవింద

- మన్యంకొండలో వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చిన స్వామివారు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి

మహబూబ్‌నగర్ రూరల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి క్షేత్రం శనివారం జనసంద్రమైంది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ఉత్తర ద్వారం ద్వారా లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తన్మయత్వం పొందారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారోత్సవం నిర్వహించారు. గర్భగుడిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉత్తర ద్వారాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 7గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. అదేవిధంగా శివాలయం, స్టేజీ సమీపంలోని అలివేలు మంగతాయారు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చాలామంది భక్తులు దిగువ కొండ నుంచి కొండపైకి కాలినడకన చేరుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హైకోర్టు జడ్జి సీవీ భాస్కర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్ శేషవస్త్రంతో సత్కరించారు.



శేషవాహన సేవ నిర్వహిస్తున్న పురోహితులు



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

ఘనంగా శేషవాహన సేవ

ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి శేషవాహనసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, పురోహితుల వేద మంత్రాలు, భక్తుల హరినామస్మరణ మధ్య స్వామివారి శేషవాహన సేవ కొనసాగింది. గర్భగుడి నుంచి సభా మండపం వరకు స్వామివారు ఊరేగుతూ స్వర్ణాభరణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారిని హనుమద్దాసుల మండపం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారితో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



కురుమూర్తికి పోటెత్తిన భక్తులు

చిన్నచింతకుంట: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని కురుమూర్తి స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉత్తరద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని పునీతులయ్యారు. స్వామి వారిని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. డీఐజీ వెంట ఎస్‌ఐ శేఖర్ ఉన్నారు.

చిన్నరాజమూర్ జాతరకు వేళాయె

- నేటి నుంచి వేడుకలు
- ముస్తాబైన ఆలయం
- 26న అంజన్న రథోత్సవం

దేవరకద్ర: జిల్లాలో ప్రసిద్ధి చెందిన చిన్నరాజమూర్ అంజన్న బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇక్కడ వెలిసిన అంజన్నస్వామిని కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భక్తులు కొలుస్తారు. ఎంతో గొప్ప చరిత్ర ఉన్న స్వామి వారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం వారు ఏర్పాట్లు చేస్తున్నారు.

నాలుగు వందల ఏళ్ల చరిత్ర...

చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయానికి నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉంది. దాని ప్రకారం.. వడ్డెపల్లి మండలం రాజోలీ శివారులోని తుంగభద్ర నదీ తీరాన వ్యాస మహాముని చేత అంజన్న విగ్రహం ప్రతిష్ఠించబడినట్లు శాసనం ద్వారా తెలుస్తోంది. కాలక్రమంలో విగ్రహం భూమిలోపలకు ఉండిపోయింది. ఆ తరువాత కాలంలో ఓ రైతు తన పొలం దున్నుతుండగా నాగలికి విగ్రహం తగిలి బయట పడింది. ఈ క్రమంలో బయట పొలం గట్టున స్వామి విగ్రహాన్ని ఉంచి రైతు పూజలు చేశాడు. కాగా అదే రోజు రాత్రి రైతు కలలో స్వామి కనిపించి ఎడ్లబండిపై తన విగ్రహాన్ని తీసుకుని ఉత్తర దిశగా ప్రయాణించి ఎక్కడైతే బండి ఇరుసు విరుగుతుందో... అక్కడ తన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని చెప్పాడు. స్వప్న వృత్తాంతం ప్రకారం ఆ రైతు ఎడ్లబండిపై విగ్రహాన్ని తెస్తుండగా చిన్నరాజమూర్ సమీపాన ఇరుసు విరిగి పడింది. దీంతో అదే ప్రాంతంలో శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆ రైతు వంశస్తులు స్వామి వారిని దర్శించుకుని వెళ్తున్నారు.



వేడుకలకు ముస్తాబైన ఆలయం



చిన్నరాజమూర్ అంజన్న

బ్రహ్మోత్సవాల్లో రోజు వారి విశేష పూజలు....

- 24న ధ్వజారోహణం, పంచామృతాభిషేకం, అలంకరణ, పవమాన హోమం, శ్రీనివాస కల్యాణం, హంస వాహనసేవ ఉంటాయి.
- 25న సోమవారం పంచామృతాభిషేకం అలంకరణ, అశ్వవాహన సేవ ప్రభోత్సవం నిర్వహిస్తారు.
- 26న పంచామృతాభిషేకం మహాలంకరణ, గజవాహనసేవ, రథోత్సవం నిర్వహించనున్నారు.
- 27న అవభృతస్నానం, పల్లకీసేవా
- 28న పంచామృతాభిషేకం, అలంకరణ, పల్లకీసేవా ఉంటాయి. ఆ తరువాత రెండు వారాల పాటు జాతర కొనసాగనుంది.

జోగుళాంబ సన్నిధిలో హైకోర్టు జడ్జి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామిని శనివారం హైకోర్టు జడ్జి సీవీ భాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. ముందుగా ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, అర్చకుడు వనం శ్రీకాంత్‌శర్మ స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి, శేషవస్త్రాలతో సత్కరించారు. ఆయన వెంట జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కుష, స్థానిక కోర్టు న్యాయమూర్తి కమలాపురం కవిత, న్యాయవాది నర్సింహ ఉన్నారు. అదేవిధంగా హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఆడిటింగ్ విభాగం) చిన్న సాంబశివరావు కుటుంబ సమేతంగా జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సినీ టాప్ సింగర్ సింహ కూడా ఉభయ ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు.



హైకోర్టు జడ్జి సీవీ భాస్కర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, చైర్మన్

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణంలోని భవానీనగర్ కాలనీలో గల ఓ ఇంట్లో దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు.. మదనాపురం మండలం అజ్జకొల్లుకు చెందిన రాఘవేంద్రశెట్టి, లావణ్య దంపతులు కొత్తకోటలోని భవానీనగర్ కాలనీలో నివాసముంటున్నారు. రాఘవేంద్రశెట్టి ఆత్మకూర్‌లోని సహార కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా.. లావణ్య కిరాణా షాపు నడుపుతోంది. రోజు మాదిరిగానే శుక్రవారం ఇంటికి తాళంవేసి, ఎవరి పనులకు వారు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు.. ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 3తులాల బంగారం, రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. రాత్రి 10గంటల సమయంలో ఇంటికి వచ్చిన బాధిత కుటుంబ సభ్యులు.. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి శనివారం జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీంను రప్పించి విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



దొంగలు ధ్వంసం చేసిన బీరువాను పరిశీలిస్తున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

మినుములో సస్యరక్షణ చర్యలు



కొరినోస్పొరా ఆకుమచ్చ తెగులు ఆకు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: మినుముల పంటకు పలు రకాల తెగుళ్లు ఆశిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పంట పలు ప్రాంతాల్లో పూత, కాయ దశకు చేరుతున్నాయి. ఈ దశలో సాగులో ఉన్న మినుము పంటలను రక్షించుకోవడానికి రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియా నాయక్ రైతులకు సూచించారు. వివరాలు ఆయన మాటల్లోనే..


మరూకా మచ్చల పురుగు

మరూకా మచ్చల పురుగు మొగ్గ, పూత, పిందె దశలో ఆశించి ఎక్కువ నష్టం కలుగజేస్తుంది. పూత దశలో పూలను గూడుగా చేసి లోపలి పదార్థాన్ని తింటుంది. కాయలు తయారయ్యేటప్పుడు వాటిని చేర్చి గూడుగా కట్టి కాయలకు రంధ్రాలు చేసి లోపలి గింజలను తినడం వల్ల పంటకు ఎక్కువ నష్టం కలుగుతుంది.

నివారణ ఇలా..

పైరు పూత దశకు రాకముందు నుంచే జాగ్రత్తలు పాటించాలి. పూత దశలో తప్పనిసరిగా పైరుపై లీటరు నీటిలో 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె 5 మి.లీ., కలిపి పిచికారీ చేయాలి. దీంతో ఈ పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. వేప సంబంధిత మందులు వికర్షకాలుగా పని చేయడం వలన రెక్కల పురుగులు గుడ్లు పెట్టడానికి ఇష్టపడవు. అంతేకాక అప్పటికే పంట మొక్కలపై ఉన్న గుడ్లు కూడా పగిలి చనిపోతాయి.

- మొగ్గ, పూత దశలో పరిశీలిస్తే పిల్ల పురుగులు ఉంటాయి. వాటి నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ., లేదా థయోడికార్బ్ 1 గ్రాము లేదా ఎసిఫేట్ 1.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పంటల్లో గూళ్లు గమనిస్తే వాటి నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రాములు లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ., లేదా క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ., నొవాల్యూరాన్ 1.0 మి.లీ., ఏదో ఒక మందుతోపాటు ఊదర స్వభావం కలిగిన డైక్లోరిపాస్ మందును 1.0 మి.లీ., ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే మందులను మార్చి 2 నుంచి 3 సార్లు పూత, కాయ దశలో పిచికారీ చేయాలి.
- పురుగు ఉధృతి ఉంటే స్పైనోసాడ్ 0.3 మి.లీ., లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా ఫ్లూబెండి ఎమైడ్ 0.2 మి.లీ., లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి.



మచ్చల పురుగు

తుప్పు తెగులు

మినుము 60 నుంచి 65 రోజుల దశలో ఉన్నప్పుడు తుప్పు తెగులు ఆశిస్తుంది. ఈ తెగులు ఆశించినప్పుడు ఆకు ఉపరితలం పైన లేదా పసుపు వర్ణం కలిగిన గుండ్రని చిన్న మచ్చలు ఏర్పడతాయి. అవి కుంభాకృతితో కూడిన గుండ్రని మచ్చలు కుంకుమ లేదా తుప్పు రంగును పోలి ఉంటాయి.

నివారణ ఇలా..

కొరినోస్పొరా ఆకుమచ్చ తెగులు, బూడిద తెగులు, తుప్పు తెగులు నివారణకు లీటరు నీటికి 30 నుంచి 35 రోజుల దశలో 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్, 1.0 మి.లీ., డైనోకాప్, 60 నుంచి 65 రోజుల దశలో రెండోసారి వాడిన మందును లేదా 1.0 మి.లీ., కాలిక్సిన్ లేదా 1 గ్రాము బైలాటన్ గాని కలిపి పిచికారీ చేయాలి.

- ఈ తెగుళ్లు వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు, ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు, మంచు పడుతున్నప్పుడు ఎక్కువగా ఆశిస్తాయి.

కొరినోస్పొరా ఆకుమచ్చ తెగులు

రబీ మాగాణుల్లో వేసిన మినుముకు 35 నుంచి 40 రోజుల దశలో కొరినోస్పొరా ఆకుమచ్చ తెగులు ఆశిస్తుంది. ఇది సోకిన ఆకులపై చిన్న చిన్న గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడి మచ్చలు పెద్దవై ఆకులపైనా కింది భాగాలకు కొమ్మలకు, కాయలకు వ్యాపిస్తుంది.

భక్తుల కొంగుబంగారం పడమటి అంజన్న



మక్తల్‌లో పడమటి ఆంజనేయస్వామి దేవాలయం

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 26న రథోత్సవం

మక్తల్: మక్తల్‌లో వెలిసిన పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్త భీమాచారి, ఆలయ ఈఓ శ్యాంసుందరచారీ తెలియజేశారు. ఆదివారం ఉదయం 7 గంటలకు ఉత్తరాధి మఠం నుంచి ఊరేగింపు 7:30 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణ, అలంకారోత్సవం, సాయంత్రం గజవాహన సేవ, 25న ఉదయం పవన హోమం, సాయంత్రం నెమలి వాహన సేవ, 6 గంటలకు ప్రభోత్సవం, 26న సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, 27న సాయంత్రం 5 గంటలకు హంసవాహన సేవ, సాయంత్రం 6.30 గంటలకు పాలఉట్ల కార్యక్రమం, 28న ఉదయం 10 గంటలకు చక్రతీర్థస్నానం, 11 గంటలకు అశ్వవాహన సేవ, 29న కల్పవృక్ష వాహనసేవ కార్యక్రమం అనంతరం పూలరథం, పల్లకీసేవ కార్యక్రమం అనంతరం ప్రతినిత్యం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

ఆలయ చరిత్ర..

భక్తుల కొంగు బంగారమై కోర్కెలు తీర్చగా వెలిసిన పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం ఎంతో ప్రాచుర్యం పొందింది. మక్తల్‌లో కొలువుదీరిన పడమటి ఆంజనేయస్వామి దేవాలయం దక్షిణ భారత దేశంలో ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రతి పల్లెలో ఆంజనేయస్వామి విగ్రహాలు తూర్పు దిశకు ముఖమై ఉంటాయి. కానీ మక్తల్‌లో వెలిసిన ఆంజనేయస్వామి వారి విగ్రహం పశ్చిమ(పడమటి) దిశకు కొలువుదీరి ఉండటం విశేషం. ఇలాంటి విగ్రహం దక్షిణ భారత దేశంలో మరెక్కడా లేదని పురావస్తు శాఖ అధికారులు చెబుతున్నారు. పశ్చిమవైపు స్వామివారు ముఖమై ఉండటంతో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ దేవాలయం గర్భగుడికి పైకప్పు లేకపోవడం గమనార్హం. పూర్వం గర్భగుడికి పైకప్పు నిర్మిస్తే అది బీటలు వారి పడిపోయిందని ప్రతీక. అప్పటి నుంచి స్వామివారి విగ్రహం ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉంది. అయితే స్వామివారి గర్భగుడి నిర్మించాలంటే ఏడు సప్తసముద్రాల జలాలను ఒకే రోజు తీసుకొచ్చి గర్భగుడి నిర్మించాలని స్వామివారు ఆజ్ఞాపించినట్లు కథనం. అది సాధ్యం కాకపోవడంతో అలాగే వదిలిపెట్టారు. ఆంజనేయస్వామి భారీ విగ్రహం ఇంత వరకు భూమిపై ఎలాంటి ఆధారం లేకుండా నిల్చుని ఉండటం ఇక్కడ మరో విశేషం. సుమారు ఏడడుగుల పైనే ఉన్న ఈ విగ్రహం ఎలాంటి ఆధారం లేకుండా ప్రతిష్ఠించారు.



ఆంజనేయస్వామి మూలవిరాట్

జాంబవంతుడు ప్రతిష్ఠించడంతో..

జిల్లా కేంద్రానికి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలోని మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని అంతర్రాష్ట్ర ప్రధాన రహదారికి అతి చేరువలో వెలిసిన పడమటి ఆంజనేయస్వామి విగ్రహాన్ని సాక్ష్యాత్తు జాంబవంతుడు ప్రతిష్ఠించారని పురాణాలు చెబుతున్నాయి. స్వామి వారి విగ్రహాన్ని జాంబవంతుడు పశ్చిమ ముఖంగా ప్రతిష్ఠించడంతో పడమటి ఆంజనేయస్వామిగా పేరు వచ్చినట్లు ఆలయ చరిత్రను బట్టి తెలుస్తుంది. స్వామి వారి విగ్రహం ఎత్తుగా ఉండటంతో పూర్వం స్వామిని కొలిచే అర్చకులు చాలా పొట్టిగా ఉండటంతో వారి కోరిక మేరకు స్వామి వారు ఒకవైపు వంగి ఉండటమే ఇక్కడి ప్రతీతి. కాగా స్వామివారికి 41 రోజులపాటు భక్తి ప్రపత్తులతో కొలచిన వారికి తమ ఇతిబాధలు తీరుతాయని విశ్వాసం. స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతియేటా మార్గశిర మాసంలో పౌర్ణమి రోజు రథోత్సవం ఎంతో వైభవోపేతంగా నిర్వహిస్తారు.

వేల సంఖ్యలో భక్తులు..

బ్రహ్మోత్సవాలను తిలకించడానికి మన రాష్ట్రం నుంచే కాక పక్కన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి తమ మొక్కులు తీర్చుకుంటారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జాతర సందర్భంగా భక్తులకు తాగునీటి వసతి, విద్యుత్, భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రథోత్సవరం రోజు బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర నాటకం ఉచితంగా ప్రదర్శించనున్నారు. భక్తులు పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

LAND for SALE
అచ్చంపేట నుండి నాగర్‌కర్నూల్ వెళ్ళేహైవే రోడ్‌కి జంగుంట గ్రామం, కమర్షియల్ ల్యాండ్
3ఎకరాల 38గుంటల భూమి అమ్మబడును
సెంట్రల్ గవర్నమెంట్ అప్రూవ్ చేసిన హైదరాబాద్ చెన్నై వయా నంద్యాల, తిరుపతి మీదుగా వెళ్ళే 4 లైన్ నేషనల్ హైవేకి దగ్గరలో ఈ భూములు కలవు.
6281076256

SERVICES

BUSINESS OFFER
- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషీన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9810515824, 8800496710

HEALTH CARE

ORTHOPEDIC SURGEON
- డా॥ యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228666, 83412 98666

GENERAL & LAPROSCOPIC SURGEON
- కార్తిక్ హాస్పిటల్, సంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి, షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స, EHS సౌకర్యం కలదు. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజీషియన్, డా॥పార్వతీదేవి, M.D.DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్:10-8PM, 08518-226162

సాక్షి భవిత విద్యార్థుల కోసం

MARRIAGE SERVICES

వధువు కావలెను
- మున్నూరు కాపు: 31Y/5.8H/ Qly: డిగ్రీ, జీతం: 50,000/-P.M., కోటి ఆస్తి. కుల ప్రసక్తి లేని గద్వాల వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర:9440122681.

WANTED
- పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640258899/ 9640468899
- మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9849933042, 9177736926.
- WANTED SALES GIRLS/SALES BOYS. Qualification : Any Graduate, For Himalaya Wellness Store, Padmavati Colony, Mahabubnagar. Attractive Salaries and Comissions Contact : Dr.Kaleem, Swasth Pharmacy. Mob : 9642172373, 7032347250.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసనీయంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు -సాక్షి మేనేజర్

టీడీపీ అక్రమాలపై చర్యలు తీసుకోండి

- ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడుతోంది
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని వినతి




మాట్లాడుతున్న పేర్ని నాని. పక్కన నాగార్జున, అబ్బయ్య చౌదరి, జోగి రమేశ్, లేళ్ల అప్పిరెడ్డి, గౌతమ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో టీడీపీ భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారుల బృందానికి ఫిర్యాదు చేశారు. మైపార్టీ డ్యాష్ బోర్డు.కామ్ వెబ్‌సైట్ ద్వారా ఓటర్ల వ్యక్తిగత వివరాలను టీడీపీ అక్రమంగా సేకరిస్తోందన్నారు. ఆ పార్టీకి మద్దతు తెలపని ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇందుకోసం తప్పుడు సమాచారంతో భారీ ఎత్తున ఫామ్–7లను ఎన్నికల సంఘానికి సమర్పిస్తోందన్నారు. పైగా దొంగే దొంగ అన్నట్లు టీడీపీ నేతలే ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతూ తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతపై విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఈసీ అధికారుల బృందం శనివారం కూడా సమీక్ష నిర్వహించింది. ఈ నేపథ్యంలో సీఈసీ బృందాన్ని మంత్రులు జోగి రమేశ్, మేరుగు నాగార్జున, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొఠారు అబ్బయ్య చౌదరి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఫైబర్ నెట్ చైర్మన్ గౌతం రెడ్డి, నవరత్న పథకాల అమలు వైస్ చైర్మన్ నారాయణమూర్తిలతో కూడిన వైఎస్సార్‌సీపీ బృందం కలిసింది. ఈ సందర్భంగా ఢిల్లీలో ఈ నెల 14న సీఈసీకి చేసిన ఫిర్యాదులను మరోసారి వైఎస్సార్‌సీపీ నేతలు సీఈసీ బృందం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో టీడీపీ అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశామని చెప్పారు.

నీళ్లివ్వండి.. కరెంట్ ఇస్తాం!

కృష్ణా జలాలపై మహారాష్ట్రకు విజ్ఞప్తి చేయనున్న రాష్ట్ర సర్కారు

- ఆ రాష్ట్రంలో కృష్ణా ఉపనదిపై ఉన్న కోయినా డ్యామ్ నుంచి నీటి విడుదల కోరాలని నిర్ణయం
- కోయినాలో విద్యుదుత్పత్తి ద్వారా అరేబియా సముద్రంలోకి నీళ్లు
- అలా వృథా చేయకుండా దిగువన ఆల్మట్టికి విడుదల చేస్తే మేలు
- అక్కడి నుంచి నారాయణపూర్ మీదుగా జూరాలకు నీళ్లు వచ్చే చాన్స్
- కోయినాలో కోల్పోయే మేర కరెంట్‌ను రాష్ట్రం నుంచి ఇస్తామనే ప్రతిపాదన
- శ్రీశైలం, సాగర్‌లలో నిల్వలు అడుగంటిపోవడంతో సర్కారు ఆలోచన



మహారాష్ట్రలోని కోయినా డ్యామ్

సాక్షి, హైదరాబాద్: కృష్ణానది బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోయిన నేపథ్యంలో.. యాసంగిలో సాగు, వేసవి తాగునీటి అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. మహారాష్ట్రలో కృష్ణా ఉపనది అయిన కోయినాపై ఉన్న డ్యామ్ నుంచి కృష్ణానదికి నీటిని విడుదల చేయించుకోవడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న తొలి మేజర్ ప్రాజెక్టు అది. 105.27 టీఎంసీల సామర్థ్యంతో కోయినా నదిపై నిర్మించిన ఈ డ్యామ్‌ను జలవిద్యుదుత్పత్తి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. 1,920 మెగావాట్ల భారీ సామర్థ్యం దీని సొంతం. ఇక్కడ విద్యుదుత్పత్తి చేయడం ద్వారా వదిలే నీళ్లు.. దిగువన నదిలోకి కాకుండా, మరో మార్గంలో పడమర వైపు వెళ్లి అరేబియా సముద్రంలో కలుస్తాయి. ప్రస్తుతం డ్యామ్‌లో 86.32 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. విద్యుదుత్పత్తి కోసం నీటిని వృథాగా సముద్రం పాలు చేయడానికి బదులుగా.. దిగువన ఉన్న తెలంగాణ అవసరాల కోసం కృష్ణానదిలోకి విడుదల చేయాలని మహారాష్ట్రను కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. బదులుగా ఆ నీటితో ఎంత మేర విద్యుత్ ఉత్పత్తి కాగలదో.. అంతమేర మహారాష్ట్రకు ఉచితంగా సరఫరా చేయాలని యోచిస్తోంది. దీనిపై త్వరలోనే మహారాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వయంగా లేఖ రాసే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఈ అంశం చర్చకు వచ్చిందని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని వివరించారు.

వందల కిలోమీటర్లు ప్రవహించి..

కోయినా డ్యామ్ నుంచి విడుదలయ్యే నీళ్లు సుమారు 118 కిలోమీటర్ల పొడవునా కోయినా నదిలో ప్రవహించి కృష్ణానదిలో కలుస్తాయి. అక్కడి నుంచి ప్రధాన పాయలో ప్రవహిస్తూ.. 518 కిలోమీటర్ల దూరంలోని ఆల్మట్టి రిజర్వాయర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ఆల్మట్టి నుంచి దిగువన ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి తెలంగాణ భూభాగంలోకి ప్రవేశించి జూరాల రిజర్వాయర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా దాదాపు 900 కిలోమీటర్ల మేర ప్రవహించాలి. ఇలా జూరాలకు చేరుకున్నాక.. అవసరాన్ని బట్టి శ్రీశైలం జలాశయానికి, అక్కడి నుంచి నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేసుకోవచ్చు. సాగర్ వరకు చూస్తే.. 1,400 కిలోమీటర్లు ప్రవహించి రావాల్సి ఉంటుంది.

ఆ రెండు రాష్ట్రాల సమ్మతి ఉంటేనే..

కోయినా డ్యామ్ మహారాష్ట్రలో ఉండగా.. ఆల్మట్టి, నారాయణపూర్ కర్ణాటకలో ఉన్నాయి. అంటే ఈ రెండు రాష్ట్రాల సమ్మతి వస్తేనే కోయినా డ్యామ్ నుంచి నీళ్లను తెచ్చుకోవడం సాధ్యమవుతుంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఉండటంతో పెద్దగా ఇబ్బందులు ఉండవని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఎంతమేర అంగీకరిస్తుందన్నది సందేహమేనని అంటున్నాయి. గతంలో బీఆర్‌ఎస్ సర్కారు కూడా కోయినా డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయించుకోవడానికి ప్రయత్నించినా.. మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదని వివరిస్తున్నాయి.

పొదుపుగా వాడుకుంటేనే నీళ్లు

శ్రీశైలం గరిష్ట నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 52.42 టీఎంసీల నీళ్లే ఉన్నాయి. నాగార్జునసాగర్ సామర్థ్యం 312.05 టీఎంసీలుకాగా.. 154.43 టీఎంసీలే ఉన్నాయి. వీటిలో డెడ్ స్టోరేజీకిపైన వినియోగించుకోగల నీళ్లు తక్కువే. అందువల్ల పొదుపుగా వాడుకుంటే వచ్చే వేసవిలో హైదరాబాద్ జంట నగరాలతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తాగునీటి అవసరాలకు సరిపోతాయని నీటిపారుదల శాఖ అంచనా వేస్తోంది. అయితే ముందు జాగ్రత్త చర్యగా కోయినా డ్యామ్ నుంచి నీళ్లను విడుదల చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మహారాష్ట్ర అంగీకరిస్తే సాగునీటికి సైతం కొంత వరకు నీళ్లను విడుదల చేయవచ్చని ఆలోచిస్తున్నట్టు సమాచారం.


చాలా కాలం నుంచి కోరుతున్నా..

మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో పుట్టి.. కోయినా నది తూర్పు వైపు ప్రవహించి కృష్ణా నదిలో కలుస్తుంది. ఇలా కలిసేచోటుకన్నాపైన కోయినా నదిపై మహారాష్ట్ర భారీ డ్యామ్‌ను, జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించింది. అందులో విద్యుదుత్పత్తి చేశాక నీటిని పశ్చిమం వైపు విడుదల చేస్తోంది. ఆ నీళ్లు అటువైపే ప్రవహించి వృథాగా అరేబియా సముద్రం పాలవుతున్నాయి. కే–1 సబ్‌బేసిన్‌లోని ఈ కోయినా ప్రాజెక్టుకు గతంలో బచావత్ ట్రిబ్యునల్ 67.5 టీఎంసీల నీటిని కేటాయించగా.. బ్రిజేశ్ ట్రిబ్యునల్ 25 టీఎంసీలకు తగ్గించింది. కోయినా ప్రాజెక్టులో జలవిద్యుదుత్పత్తి చేయవద్దని దిగువన ఉన్న రాష్ట్రాలు చాలా కాలం నుంచి కోరుతున్నాయి. కానీ మహారాష్ట్ర పట్టించుకోవడం లేదు.

చంద్రబాబుతో ప్రశాంత్ కిషోర్ సమావేశం

సీఎం రమేష్ సొంత విమానంలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన లోకేశ్

- గన్నవరం నుంచి నేరుగా చంద్రబాబు ఇంటికి రాక
- పీకేపై గతంలో తీవ్ర విమర్శలు చేసిన బాబు
- ఇప్పుడు ఆయనతోనే ఎన్నికల వ్యూహాలకు సమావేశం





సాక్షి, అమరావతి/గన్నవరం: ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ (పీకే) శనివారం టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. వారిద్దరూ మూడు గంటలకు పైగా సమావేశమైనట్లు సమాచారం. టీడీపీ నేత లోకేశ్‌తో కలిసి ప్రశాంత్ కిషోర్ శనివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి నారా గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి ఇద్దరూ కలిసి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. ప్రశాంత్ కిషోర్‌తో చంద్రబాబు, లోకేశ్ రాజకీయ అంశాలపై చర్చించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. రాబోయే ఎన్నికల్లో టీడీపీ పరిస్థితి ఏమిటనే దానిపై వారు మాట్లాడినట్లు తెలిపాయి. అనంతరం సాయంత్రం ప్రశాంత్ కిషోర్ గన్నవరం విమానాశ్రయానికి చేరుకొని, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయారు. చంద్రబాబును మర్యాదపూర్వకంగానే కలిశానని సమావేశం తర్వాత ప్రశాంత్ కిషోర్ మీడియాకు తెలిపారు. ఆయన సీనియర్ నాయకుడని, అందుకే కలిశానని చెప్పారు. చంద్రబాబుతో ఏ అంశాలపై చర్చించారో వెల్లడించలేదు.

అప్పుడు ప్రశాంత్ కిషోర్ చేదు..

బిహార్ వాడికి ఇక్కడ పనేంటి అంటూ ప్రశాంత్ కిషోర్‌పై గత ఎన్నికల సమయంలో నానా రకాలుగా తూలనాడిన చంద్రబాబు.. ఇప్పుడు అదే ప్రశాంత్ కిషోర్‌తో సమావేశమవడం చర్చనీయాంశమైంది. వ్యక్తులను, పార్టీలను, సంస్థలను అవసరమైనప్పుడు అక్కున చేర్చుకోవడం, అవసరం తీరాక గిరాటేయ్యడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. సీపీఐ, సీపీఎం, బీజేపీ, జనసేన పార్టీలతో ఆయన ఆడుతున్న ఆటలు, అవసరం తీరాక వాటిని గడ్డిపరక కింద జమకడతారు. మళ్లీ అవసరమైతే అదే వ్యక్తులను చేరదీస్తారు. ఇదంతా కళ్లకు కనిపిస్తున్నదే. ఎన్నికల్లో మిత్రపక్షాలనే మోసం చేయడం బాబు హాబీ. ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ విషయంలోనూ బాబు ఇదే తీరుతో వ్యవహరిస్తున్నారు. 'ఆయనో పెద్ద వ్యూహకర్త' అంటూ 2019లో ప్రశాంత్ కిషోర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బిహార్ నుంచి వచ్చిన ప్రశాంత్ కిషోర్ రాష్ట్రంలో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశాంత్ కిషోర్ అప్పట్లో చంద్రబాబుకు సమాధానం ఇస్తూ.. 'కళ్ల ముందు ఓటమి కనిపిస్తుంటే సీజన్లకు అనుగుణంగా రాజకీయాలు చేసే చంద్రబాబు అలా మాట్లాడటం తనను ఆశ్చర్యపరచలేదు' అంటూ కౌంటర్ ఇచ్చారు. బిహార్‌కు వ్యతిరేకంగా, అభ్యంతరకరంగా మాట్లాడడం మానేసి, ఏపీ ప్రజలు మళ్లీ ఆయనకు ఓట్లు ఎందుకు వేయాలో చెప్పాలని చంద్రబాబుకు సూచించారు. అప్పట్లో ప్రశాంత్ కిషోర్‌పై ఆరోపణలు గుప్పించిన లోకేశ్ ఇప్పుడు దగ్గరుండి ప్రత్యేక విమానంలో తీసుకొని వచ్చారు.

బీజేపీ నేత సీఎం రమేష్ విమానంలో వచ్చిన ప్రశాంత్

ప్రశాంత్ కిషోర్‌ను విజయవాడ తీసుకురావడానికి చంద్రబాబు బీజేపీలో ఉన్న తన అనుచరుడు సీఎం రమేష్‌కి చెందిన విమానాన్ని వాడుకోవడం పైనా చర్చ జరుగుతోంది. రిత్విక్ గ్రీన్ పవర్ అండ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన విమానంలో లోకేశ్, ప్రశాంత్ కిషోర్ హైదరాబాద్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఈ కంపెనీ సీఎం రమేష్‌దనే విషయం అందరికీ తెలిసిందే. ఆ విమానంలోనే ప్రశాంత్‌ను తీసుకువచ్చిన లోకేశ్ మళ్లీ అదే విమానంలో తిరిగి హైదరాబాద్ తీసుకెళ్లారు. దీన్నిబట్టి సీఎం రమేష్ బీజేపీలో ఉంటూనే చంద్రబాబు కోసం పని చేస్తున్నారనే విషయం మరోసారి స్పష్టమైంది.

మెటీరియల్ బాగోకపోతే మేస్త్రి ఏం చేస్తాడు : అంబటి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అసలు మెటీరియల్ బాగోకపోతే ఏ మేస్త్రి అయినా ఏం చేస్తాడని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో శనివారం చంద్రబాబు భేటీ కావడంపై అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. ఎంతమంది పీకేలు వచ్చినా వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరని అన్నారు. 'గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా పనిచేసిన బిహార్‌కు చెందిన ప్రశాంత్ కిషోర్ (పీకే) ఈ రోజు లోకేశ్‌ను, టీడీపీ పెద్దలను కలిశాడని.. ఆయన వారికి వ్యూహకర్తగా ఉండబోతున్నారన్న వార్త వచ్చింది. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా పనిచేశారు. ఆయన వ్యూహకర్తగా పనిచేసిన రోజుల్లో ఇదే లోకేశ్, ఇదే చంద్రబాబు నాయుడు ఆయన గురించి ఏం మాట్లాడారో గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన పీకే కాదు.. బిహార్ డెకాయిట్ అని చంద్రబాబు అన్నారు. పీకే తోకలు కత్తిరిస్తాం. ఆయన ఏమైనా చేయగలడా అని కూడా అన్నారు' అని అంబటి గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీతో కలిసి పనిచేస్తున్నాం

సీఎం జగన్ ఘనవిజయమే మా లక్ష్యం: ఐ–ప్యాక్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది నుంచి వైఎస్సార్‌సీపీతో కలిసి పనిచేస్తున్నామని ఐ–ప్యాక్ వెల్లడించింది. 'రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి అనునిత్యం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మా వంతు తోడ్పాటును అందిస్తాం. 2024 ఎన్నికల్లో సీఎం జగన్ తిరుగులేని విజయం సాధించడానికి కృషి చేస్తాం' అని ఐ–ప్యాక్ శనివారం ఓ ట్వీట్ ద్వారా స్పష్టం చేసింది.



బాలుర విభాగంలో విజేతగా ట్రోఫీ అందుకుంటున్న మహబూబ్‌నగర్ జట్టు



బాలికల విభాగంలో మూడో స్థానంలో నిలిచిన పాలమూరు జట్టు

కబడ్డీలో సత్తా చాటిన పాలమూరు

హనుమకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో మూడు రోజుల పాటు కొనసాగిన పాఠశాలల క్రీడల సమాఖ్య అండర్–17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో ఉమ్మడి పాలమూరు జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో నల్లగొండ జట్టును ఓడించి చాంపియన్‌షిప్‌ను సాధించింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 20 జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. కాగా.. బాలుర విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో పదో తరగతి చదువుతున్న నందకిషోర్ అద్భుతమైన ప్రతిభ చాటి తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలో జరగనున్న జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఈసందర్భంగా నందకిషోర్‌కు నాగర్‌కర్నూల్ డీఈఓ గోవిందరాజులు, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ పాండు, జిల్లా స్కూల్ సెక్రెటరీ ప్రసాద్ గౌడ్, జిల్లాసైన్స్ అధికారి కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు.

– మహబూబ్‌నగర్ క్రీడలు/కందనూలు

పురాతన విగ్రహాలు మ్యూజియంకు తరలింపు



క్రేన్ ద్వారా బయటికి తీస్తున్న పురాతన విగ్రహాలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి కృష్ణానదిలో ఉన్న పురాతన విగ్రహాలను మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి మ్యూజియంకు తరలిస్తున్నట్లు రాష్ట్ర పురావస్తుశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ శనివారం తెలిపారు. రెండు రోజులుగా పురావస్తుశాఖ అధికారులతో కలిసి ఆయన బీచుపల్లి కృష్ణానదిలో ఉన్న 13వ శతాబ్దానికి చెందిన దాదాపు 120 పురాతన విగ్రహాలను గుర్తించి బయటికి తీసి మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ కృష్ణానదిలో గుర్తించిన పురాతన విగ్రహాలు అన్ని కూడా చుట్టు పక్కల ప్రాంతాల్లోని ఆయా ఆలయాల్లో పాడైపోయి పూజకు పనికి రాకుండా ఉండటంతో నీటి ప్రవాహం ఉన్న నదిలో పారేస్తుంటారని తెలిపారు. దశాబ్దాల కాలం నుంచి పడేసిన విగ్రహాలే నదిలో అధికంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో విగ్రహాలన్ని బయటపడ్డాయన్నారు.



నదిలో నుంచి పురాతన విగ్రహాలను తీయిస్తున్న అధికారులు

క్రాస్‌కంట్రీ పోటీల్లో బంగారు పతకం



మహబూబ్‌నగర్ క్రీడలు: కామారెడ్డిలో శనివారం 9వ రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ (పరుగు) పోటీల్లో జిల్లా క్రీడాకారిణి మహేశ్వరి మెరుగైన ప్రతిభ కనబరిచింది. ఆమె 10కిలోమీటర్ల పరుగును 38నిమిషాల 36 సెకండ్లలో పూర్తిచేసి బంగారు పతకాన్ని సాధించింది. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, ఉపాధ్యక్షుడు రాజేంద్రకుమార్, కోచ్‌లు ఆనంద్, సునీల్, సాధిక్‌అలీ, సభ్యులు అభినందించారు.


క్రాస్‌కంట్రీ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ



అమ్రాబాద్: రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ చాంపియన్‌షిప్ కామారెడ్డిలో శనివారం నిర్వహించారు. ఇందులో పదరకు చెందిన బీనమోని మధుప్రియ అండర్–16 విభాగంలో 2కిలోమీటర్ల పరుగుపందెంలో రజత పథకం సాధించింది. ప్రస్తుతం ఈమె కొల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ నల్లగొండ జిల్లా డిండి సాంఘిక సంక్షేమ క్రీడా అకాడమిలో అథ్లెటిక్స్ శిక్షణ పొందుతుంది. ఈమె వచ్చే నెల 15న బీహార్‌లో నిర్వహించే జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొననుందని కోచ్ పరశురాముడు తెలిపారు.

అయ్యో.. దేవుడా!

- వైకుంఠ ఏకాదశి రోజు పూజలకు నోచుకోని యోగనారసింహుడు
- మూతబడిన ఆలయం.. పట్టించుకోని పాలకమండలి



స్వామివారికి వస్త్రాలంకరణ కూడా లేని దైన స్థితి



జన సంచారం లేని యోగనారసింహస్వామి ఆలయం

జోగుళాంబ శక్తిపీఠం: వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వార దర్శనం మాట అటుంచితే.. ఉన్న తలుపులే మూసివేసి దేవుడికి పూజలు చేయని సంఘటన అలంపూర్‌లో చోటుచేసుకుంది. మార్గశివమాసంలో వైష్ణవ సంబంధమైన ఆలయాల్లో వేంకటేశ్వర స్వామి, చెన్నకేశవ, రామాలయాలు, నరసింహ స్వామి వంటి అనేక వైష్ణవ సంబంధిత ఆలయాలన్నీ కళకళలాడుతాయి. అయితే అలంపూర్‌లోని శ్రీయోగనారసింహస్వామి ఆలయ తలుపులు మాత్రం వైకుంఠ ఏకాదశి రోజు కూడా మూతబడటం గమనార్హం. దేవాదాయ శాఖ పరిధిలోని ఈ ఆలయాలకు ఒక అర్చకుడిని ఏర్పాటు చేసినా అతను అక్కడ ఉండటం లేదు. స్థానిక భక్తులు ఆలయాలను తెరచి ఉంచాలని అనేకసార్లు విజ్ఞప్తి చేయగా దేవాదాయ శాఖ అధికారులు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు దర్శన వేళలు అని బోర్డు పెటారు.

పాలక మండలి నిర్లక్ష్యం

వైకుంఠ ఏకాదశి రోజు అలంపూర్‌లోని యోగనారసింహస్వామి ఆలయాలను పాలక మండలి నిర్లక్ష్యం చేసింది. ఆలయానికి కనీసం మామిడి తోరణాలు కూడా కట్టలేదు. ఆలయంలోని శ్రీయోగనారసింహస్వామి మూల విరాట్‌కు కేవలం గంధంతో విగ్రహానికి అలంకరణ చేసి వదిలేశారు. ఇంతమంది పాలక మండలి సభ్యులు ఉన్నప్పటికీ ఏ ఒక్కరు కూడా ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకున్న దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. ఆలయాల నిర్వహణ చేత కాకపోతే దేవాదాయశాఖ నుంచి యోగనారసింహస్వామికి విముక్తి కల్పించి.. భక్తులకు అప్పగించాలని హిందు ధార్మిక సేన రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్‌శర్మ డిమాండ్ చేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం



బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

మహబూబ్‌నగర్ క్రీడలు: నిర్మల్‌లో శనివారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్–17 విభాగం సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు రాణించింది. ఈ పోటీల్లో బాలికల జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. దీనిపై ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు, సహాయ కార్యదర్శి వేణుగోపాల్, కోచ్ సాధిక్‌అలీ, నాగరాజు, రాఘవేందర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

1,019 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,019 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు.

జవాబుదారీగా వ్యవహరించండి

హైకోర్టు న్యాయమూర్తి సీవీ భాస్కర్‌రెడ్డి

గద్వాల క్రైం: కేసుల వ్యవహారంలో న్యాయమూర్తులు జవాబుదారీగా వ్యవహరించి, నిందితులకు శిక్షపడే విధంగా తీర్పు ఇవ్వాలని హైకోర్టు న్యాయమూర్తి సీవీ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కోర్టుకు ఆయన హాజరై కోర్టు సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.కుషు, ఇతర న్యాయమూర్తులతో కేసుల వ్యవహారాలు, పోలీస్‌శాఖ నుంచి నిందితులపై వేసిన చార్జ్‌షీట్ దాఖలు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. మహిళ, పోక్సో, అత్యాచార, వరకట్న వేధింపుల కేసుల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఎస్పీ రితిరాజ్, న్యాయమూర్తులు హైకోర్టు న్యాయమూర్తిని ఘనంగా సన్మానించారు. అంతకు ముందు పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి సీవీ భాస్కర్‌రెడ్డి